37

# ఏ ఆవ్రా బావా?

( 1988 కథానికల పోటీలో ద్వితీయ బహుమతి పొందింది )

రాజ రాజ చక్రవర్తి త్రిలింగ దేశాన్ని ప్రజారంజకంగా పాలిస్తున్న కాలం అది!

ప్రతి సంవత్సరం ధాన్యకటకంలో వసంత నవరాత్రులు జరుపుతూండడం చక్రవర్తికి పరిపాటి. ఈ సందర్భంలో ఎన్నెన్నో సారస్వత కార్యక్రమాలు, మరెన్నో ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతుంటారు. ఇవన్నీ ఆస్థాన పండితుడైన శివశర్మగారి ఆధ్వర్యంలో జరుగుతుంటాయి.


ఈ కార్యక్రమాలలోని ప్రత్యేకత ఏమిటంటే... ఎప్పటికప్పుడు ప్రతి సంవత్సరం అంతకుముందు ఎప్పుడూ ప్రదర్శించనటువంటి వినూత్న అంశాలను ప్రదర్శిస్తుంటారు. ఆ అంశాలేమిటో ముందుగా తెలియజెప్పరు. అందువల్ల వాటిని ప్రకటించే వరకు అందరూ ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తుంటారు.

ఇటువంటి విశేష కార్యక్రమాలను తిలకించడానికి దేశదేశాల నుంచీ పామరులు, పండితులు సమోత్సాహంతో వస్తుంటారు.

వసంత నవరాత్రులు మొదలయ్యాయి.

ఆ ఉత్సవాలను చూడడానికి వేలాదిమంది ప్రజలు వస్తారు కనుక , కోట లోపల సభాస్థలిలో తగినంత వసతి వుండదు. అందువల్ల వెలుపలనే బ్రహ్మాండమైన పందిరి వేశారు. పందిరి గుంజలకు అరటి చెట్లను బోదెలతో కోసుకువచ్చి కట్టారు. పందిరికి అన్నివైపులా, లోపలా మామిడి తోరణాలు కట్టారు. పందిరి కింద భాగమంతా చాందినీ పర్చారు. దానికి రంగురంగుల పాదరసం బుడ్లు వేలాడదీశారు.

ప్రారంభ సమయం ఆసన్నమవుతుండగా వేదపండితులు వేదమంత్రాలను కర్ణపేయంగా పఠిస్తూ- ముందుకు సాగుతుండగా, ఆస్థాన విద్వాంసుడు శివశర్మ, ఇతర పండితులు వెంటరాగా



మంత్రులు, సేనానాయకులు పరివేష్టించి రాగా... రాజరాజ మహారాజు వందిమాగధుల జయజయ ధ్వానాల మధ్య ఆ పందిరిలో ప్రవేశించి సింహాసనం మీద కూర్చున్నారు.

ఆయన ప్రక్కన తమ తమ ఆసనాలలో మంత్రులు, సామంతులు, దండనాథులు, ఆస్థాన పండితులు, విద్వాంసులు ఆసీనులయ్యాక – సభికులు నేలమీద పరిచిన రత్నకంబళుల మీద కూర్చున్నారు.

ప్రారంభోత్సవం నాటి తొలి కార్యక్రమం సారస్వతపరమైనది.

ప్రారంభోత్సవాన్ని సూచిస్తూ సరస్వతీ ప్రార్థనతో ఆస్థాన నర్తకీమణులు నాట్యం చేశారు. ఆ తర్వాత సరస్వతీ విగ్రహానికి హారతి ఇచ్చారు.

వారు నిష్క్రమించాక శివశర్మగారు లేచి, "ఆర్యులారా! ఈనాటి ప్రారంభ కార్యక్రమమైన సారస్వత గోష్ఠిలో ఇంతకుముందు ఎవ్వరూ ఎచ్చటా చేయనట్టి, అత్యంత వినూత్నమైనట్టి అంశాన్ని చక్రవర్తుల వారు స్వయంగా ప్రకటిస్తారు" అని చెప్పి కూర్చున్నారు.

వెంటనే సభ – సభికుల కరతాళ ధ్వనులతో దద్దరిల్లింది.

రాజ రాజ చక్రవర్తి లేచారు.

మళ్ళీ సభలో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

"మంత్రి సామంత దండనాథులారా, ఆస్థాన విద్వాంసులారా, కవి సార్వ-భౌములారా, రసజ్ఞులైన సభికులారా... వసంత నవరాత్రోత్సవాల నిర్వహణలో మన రాజ్యం వినూత్న పోకడలు పోతూ దేశదేశాలలో కీర్తి ప్రతిష్ఠలను గడించింది. సారస్వతాభిలాష నాకు మెండు – అన్న సంగతి మీ అందరికీ తెలుసు.

అందువల్ల ఈనాటి వినూత్నాంశాన్ని నేనే రూపొందించి ప్రకటిస్తున్నాను.

మన సభలకు భరతవర్షంలోని వివిధ భాషలవారు వస్తారు కనుక.., భిన్న భాషలకు సంబంధించిన అంశాన్ని ఇవ్వదలిచాను. ఇది ఒక విధంగా సమస్యా పూరణం వంటిది. అది ఒక వాక్యం అయివుండాలి. ఆ వాక్యంలోని విడి అక్షరాలకు, లేదా జంట అక్షరాలకు వివిధ భాషలలో ఒకే అర్థం వుండాలి. ఇవన్నీ కలిస్తే... అది అర్థవంతమైన ఒక వాక్యం కావాలి. వాక్యం ఏ భాషకు సంబంధించినదైనా కావచ్చు. ఇతర భాషా పదాల్ని తనలో ఇముడ్చుకున్న అటువంటి వాక్యం వున్న భాషని సమగ్రంగా భావిస్తాను.

ఎల్లుండి – అనగా... నేటికి మూడవరోజున ఇదే సమయానికి ఇక్కడే సమావేశమవుదాం. అప్పటికి ఈ సమస్యని పూరించి తెలియజేయండి. ఇందులో కవివర్యులే కాదు, సామాన్య ప్రజలు కూడా ఎవరైనా పాల్గొనవచ్చు. ఈ సమస్యను సరిగ్గా పూరించిన వారికి అక్షర లక్షలిచ్చి గౌరవిస్తాను" అని ప్రకటించారు చక్రవర్తి.

సభలో నిశ్శబ్దం అలుముకుంది. ఆటుతర్వాత కవితా గానం, గోష్ఠి, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాక సభ ముగిసింది.

ం ం ం

చక్రవర్తి ఇచ్చిన సమస్య – సామాన్యులు చాలామందికి అర్థం కాలేదు.

అర్థం అయినవారు– "మన వల్ల నేమవుతుంది? అదేదో ఎల్లుండి చూద్దాం..." అనుకున్నారు.

కవులు, విద్వాంసులు తలలు బద్దలు కొట్టుకోసాగారు. అందరూ ఈ సమస్యని పూరించడం ఎవరి శక్యం కాదని, ఎవరైనా పూరించగలిగితే అది శివశర్మగారు తప్ప– వేరొకరు కాజాలరని భావించారు.

శివశర్మగారు కూడా ఈ విషయమై తీవ్రంగా ఆలోచించసాగారు.

'ఇది త్రిలింగదేశపు గౌరవ ప్రతిష్ఠలకు సంబంధించిన సమస్య ! అందరూ అనుకుంటున్నట్టు బహుశా... ఇంకెవరూ ఈ సమస్యను పూరించలేరు. అందువల్ల ఏ విధంగానైనా తానే ఈ సమస్యను పరిష్కరించి, దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప జేయాలి' అని అనుకున్నారాయన.

ఎంత ప్రయత్నించినా ఆయనకి కూడా ఈ సమస్య అంతుపట్టడంలేదు. ఆయనా, ఆయన భార్య అపర్ణాదేవి కూడా బహు భాషలు నేర్చినవారు. ఆమె కూడా పండితురాలు. దంపతులిద్దరూ ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించినా, పరిష్కారం మాత్రం ఎవ్వరికి అంతుపట్టలేదు.

రెండవరోజు కూడా గడిచిపోయింది.

మూడవరోజు పది గంటలకి తిరిగి సభ సమావేశమవుతుంది. అప్పటికి పరిష్కారం దొరక్కపోతే ఘనంగా వుండిన శివశర్మగారి కీర్తి కుప్పకూలి పోయినట్లే !

మూడవరోజు సూర్యోదయం అయింది. కాలం గడిచిపోతోంది. అయినా... సమస్య కొరుకుడు పడకుండానే వుంది.

అపర్ణాదేవి శుచిగా స్నానంచేసి పార్వతీదేవి విగ్రహం ముందు కూర్చుని భర్తకి విజయం ప్రసాదించవలసిందిగా కోరుతూ దీక్షగా పూజ చేయసాగింది.

శివశర్మగారికి ఏమీ తోచడంలేదు.

ఏ పనిచేస్తున్నా ఈ సమస్యే మనసును తొలుస్తోంది. దానికి తోడు – కొట్టంలో రెండు ఆవులు ఈనడానికి సిద్ధంగా ఉన్నాయి. ఏ నిముషాన్నయినా అవి దూడని ఈనతాయి. ఆ సమయంలో తను దగ్గర వుండి దూడ పుట్టగానే గిట్టలు తీసివేయాలి.

అందువల్ల తప్పని సరిగా కొట్టం దగ్గరే కూర్చుని ఆలోచించసాగాడు.

ఇంతలో... శివశర్మగారి మేన బావ పొరుగూరు నుంచి వచ్చాడు.

ఆయన్ని చూసి శివశర్మగారు- "బావా... ఆవుల్ని కొంచెం కనిపెట్టుకుని వుండు. నేను స్నానం చేసి జపం చేసుకుంటుంటాను. ఈలోగా ఆవు దూడ ఈనితే వెంటనే కేకేయి" అని చెప్పి లోనికి వెళ్లారు.

ఆయన స్నానం చేసి జపం చేసుకోబోతుండగా... ఒక ఆవు దూడను వేసింది.

వెంటనే బావ కొట్టం దగ్గర్నుంచి "బావా... ఆవు ఈనింది!" అని అరిచాడు.

"ఏ ఆవ్‌రా బావా?" అని అరిచాడు శివశర్మగారు.

అదే సమయానికి అపర్ణాదేవి పూజ పూర్తయింది.

భర్త కేకని ఆమె వింది. ఆమె మనస్సులో ఏదో మెరిసింది. వెంటనే భర్త దగ్గరకు వచ్చి "స్వామీ... సమస్యకి పరిష్కారం మీ నోటి నుంచే వచ్చింది" అంది ఆనందంతో.

తర్వాత ఆయన చెవిలో ఈ విషయం చెప్పింది.

శివశర్మగారి ఆనందానికి అవధిలేదు. పరువు నిలిపిన పార్వతీదేవికి మనసారా నమస్కరించారు ఆ దంపతులు.

ం ం ం

సభ క్రిక్కిరిసి వుంది.

అందరి ముఖాల్లోనూ ఉత్కంఠత ప్రస్ఫుటంగా వుంది.

చక్రవర్తి లేచి, "నేనిచ్చిన సమస్యకి పరిష్కారం చెప్పగలవారు ముందుకు రావలసింది" అన్నారు.

కాని, ఎవరూ లేవలేదు. అప్పుడు శివశర్మ గారు లేచి "మహింతెకత" అన్నారు.

మహారాజు ఆనందంతో మెరుస్తున్న కళ్లతో "ఏ ఆవ్‌రా బావా?" అని అడిగారు.

"చిత్తం..!" అన్నారు శివశర్మగారు.

"చక్రవర్తులు, కవితా చక్రవర్తులు తమలో తాము గూఢంగా మాట్లాడుకుని ఆనందిస్తున్నారు. అదేమిటో విశదీకరించి మమ్మల్ని కూడా ఆనందింపజేయ ప్రార్థన!" అన్నారు సభికులు.

చక్రవర్తి అనుమతితో శివశర్మగారు చెప్పారు-

"ప్రభువుల వారు ఇచ్చిన సమస్యకి పరిష్కారం 'ఏ ఆవ్ రా బావా?' అనే తెలుగు వాక్యంలో వుంది. మరాఠీలో 'ఏ' అన్నా, హిందీలో 'ఆవ్' అన్నా, తెలుగులో 'రా' అన్నా, కన్నడంలో 'బా' అన్నా, తమిళంలో 'వా' అన్నా అన్నింటికీ ఒకటే అర్థం- రమ్మని! ఈ

వివిధ భాషా పదాలన్నింటికీ సమానార్థమే. ఇవన్నీ కలిస్తే 'ఏ ఆవ్‌రా బావా?' అన్న అర్థవంతమైన తెలుగు వాక్యం అయింది" అంటూ వివరించారు.

సభ హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

చక్రవర్తి ఆనందంతో అవునన్నట్టు తల ఊపారు.

"ప్రభూ... శివశర్మగారు సమస్యా పరిష్కారం చెప్పడానికి లేచి 'మహింతెకత' అన్నారు. దాని భావం ఏమిటో తెలియజేయ ప్రార్థన!" అన్నారు సభికులు.

"ఏ ఆవ్‌రా బావా?' అన్నదానికి వివరణ వారు ఇచ్చారు. 'మహింతెకత' అన్నదానికి వివరణ మేము ఇస్తాము. 'మ' అంటే మరాఠీ, 'హిం' అంటే హిందీ, 'తె' అంటే తెలుగు, 'క' అంటే కన్నడం, 'త' అంటే తమిళం. ఈ భాషల మొదటి అక్షరాలు కలిపిన పదం 'మహింతెకత' అయింది. 'ఈ భాషల పదాలను బట్టి సమస్యను పరిష్కరించాను సుమా...' అంటూ నర్మగర్భంగా తెలియజేశారు ఆస్థానపండితులు!" అంటూ విడమర్చి చెప్పారు రాజరాజ చక్రవర్తి.

సభ మళ్ళీ కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది.

"సభికులారా.. మన తెలుగు భాష ఇతర భాషలన్నింటినీ తనలో సంలీనం చేసుకో గలిగిన సమగ్రమైన భాష. అందుకనే మన భాషలో వున్నన్ని సాహిత్యపరమైన గారడీలు, విశేషాలు ఇతర భాషలలో లేవు. అష్టావధానం, శతావధానం వంటి ప్రక్రియలు కూడా గొప్ప సాహిత్య గారడీలు. ఈ భాషతో నిత్యమూ వినూత్నమైన గొప్ప గొప్ప ప్రయోగాలు చేస్తుండవలసిందిగా కవివర్యులను, పండితులను, అందరినీ కోరుతున్నాను. వాగ్దానం ప్రకారం శివశర్మగారికి అక్షర లక్షలిచ్చి సత్కరిస్తున్నాను" అంటూ శర్మగారిని తన సరసగా ఆహ్వానించారు చక్రవర్తి.

ఆనాటి కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది.

★★★

